సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 17 । నవంబర్ । 2024



పర్యాటకులకు పరవశం: ఆకట్టుకుంటున్న ఉపమాక ఆలయ పరిసర ప్రాంతాలు

న్యూస్‌రీల్

కంగ్రాట్స్ బంగారూ..

- గోల్డ్ మెడల్ సాధించిన బాక్సర్ మౌనిక



బంగారు పతకం అందుకుంటున్న బాక్సింగ్ క్రీడాకారిణి మౌనిక

నర్సీపట్నం: ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో బొంతు మౌనిక స్వర్ణ పతకం సాధించింది. స్థానిక అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న మౌనిక ఈ నెల 15వ తేదీన విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం గెలుచుకుంది. ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు మెడల్ అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసరావు క్రీడాకారిణి మౌనిక, కోచ్ అబ్బులను అభినందించారు.

నేషనల్ రోలర్ స్కేటింగ్ పోటీలకు శ్రీసూర్య లాస్యంత్



లాస్యంత్, నిఖిల

అనకాపల్లి: వచ్చేనెల 9వ తేదీన మైసూర్‌లో జరిగే నేషనల్ రోలర్‌స్కేటింగ్ పోటీలకు అనకాపల్లికి చెందిన శ్రీసూర్య లాస్యంత్ ఎంపికైనట్లు అనకాపల్లి రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కోచ్ పవన్‌కుమార్ తెలిపారు. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకూ కాకినాడలో జరిగిన 36 రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించిన శ్రీసూర్య లాస్యంత్, వెండి పతకం సాధించిన నిఖిలను ఆయన అభినందించారు. మరో ముగ్గురు క్రీడాకారులు కార్తికేయన్, యగ్నేష్, స్రవంతి, పతకాలు సాధించారని చెప్పారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా
వీకెండ్ విహారం

అందాల కార్తీకం.. ఆనందాల వన విహారం.. వీకెండ్ వినోదాలమయం.. పిక్నిక్‌లతో పిల్లలకు పెద్దలకు సందడే సందడి. కార్తీక మాసం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూపులు.. వచ్చాక ఈసారి వన భోజనాలకు ఎక్కడికి వెళ్లాలా అని ప్రణాళికలు.. అన్ని ఏర్పాట్లు చేసుకొని పిల్లా పాపలతో ప్రయాణాలు.. బాగా ఎంజాయ్ చేసి, ఎన్నో అనుభూతులను మూట కట్టుకొని, వచ్చే ఏడాది వరకు ఈ జ్ఞాపకాలను పదిలంగా దాచుకుంటారు. పిక్నిక్ సీజన్ ప్రతి ఏటా వచ్చేదే అయినా నిత్య నూతనంగా ఉంటుంది..

కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది..

దర్శనీయ స్థలాల్లో పిక్నిక్ సందడి

నక్కపల్లి/ఎస్.రాయవరం/నాతవరం: జిల్లాలో దర్శనీయ స్థలాలు ఎన్నో ఉన్నాయి. ప్రకృతి సౌందర్యంతో చూపరులను కట్టి పడేస్తాయి. కొన్ని ప్రదేశాలు అటు ఆధ్యాత్మికతకు.. ఇటు విహారానికి అనుకూలంగా ఉంటాయి. నక్కపల్లి మండలంలో ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాలు పిక్నిక్‌కు ఎంతో అనువుగా ఉంటాయి. ఇక్కడ బ్రహ్మతపస్సు చేసిన బంధుర సరస్సు ఉంది.

గరుడాద్రి పర్వతంపై స్వామి మూలవిరాట్ ఉన్నారు. కొండపైనుంచి చూస్తే ఆలయ పరిసర ప్రాంతాలు ఎంతో కనువిందు చేస్తాయి. నక్కపల్లి నుంచి ప్రతి 5 నిమిషాలకు ఆటోలు తిరుగుతాయి. **ఉపమాకకు 5 కిలోమీటర్ల దూరంలో రాజయ్యపేట సముద్రతీరం ఉంది. ఇక్కడకు కూడా పర్యాటకులు వస్తుంటారు.**




అమ్మవారి కుడి భాగంలో ఎత్తైన నాగసర్పంతో కూడిన శివలింగం



మర్రిచెట్టు ఊడల మధ్యలో అమ్మవారి ఆలయం

ఆధ్యాత్మిక కేంద్రం జిల్లేడుపూడి నూకాలమ్మ

నాతవరం మండలంలోని జిల్లేడుపూడి నూకాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో అడుగు పెడితే చాలు కొత్త అనుభూతి కలుగుతుంది. మర్రిచెట్టు ఊడల మధ్యలో నిర్మించిన నూకాలమ్మ తల్లి ఆలయం.. ఎడమ వైపు ఏనుగు తొండంలోంచి కన్పించే విధంగా వినాయకుడి గుడి.. అమ్మవారికి కుడి భాగంలో నాగసర్పంతో కూడిన 50 అడుగుల శివలింగం ప్రత్యేక ఆకర్షణ. మురళీధరుడిగా శ్రీకృష్ణుడి విగ్రహం ఆకర్షణీయంగా దర్శనమిస్తుంది. సందర్శకులు ఆటలు ఆడుకునేందుకు ప్రత్యేకంగా ఊయలలు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ సమీపంలో గలగల శబ్దం చేసే తాండవ కాలువ నీటి ప్రవాహం ఎంతగానో ఆకట్టుకుంటుంది. నర్సీపట్నం, తుని మధ్య నాతవరం మండలంలో డి.యర్రవరం జంక్షన్‌లో దిగితే అక్కడ నుంచి 3 కిలోమీటర్ల దూరం ఉంటుంది. నిత్యం ఆటోలు తిరుగుతాయి. ఉదయం, సాయంత్రం నర్సీపట్నం డిపో నుంచి ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి.



అడ్డురోడ్డు జంక్షన్ నుంచి 10 కిలోమీటర్ల దూరంలో రేవుపోలవరం సముద్ర తీరం ఉంది. ఇక్కడి ఇసుక తిన్నెలు ఎంతో ఆహ్లాదాన్నిస్తాయి. రాధా మాధవస్వామి ఆలయం ఉంది. విశాఖలో కైలాసగిరిపై మాదిరిగా పర్యాటక శాఖ వారు ఇక్కడ కొండపై శివపార్వతుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. సముద్రంలోకి చొచ్చుకు వెళ్లిన జెట్టీపై షికారు చేయవచ్చు. అడ్డురోడ్డు, నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్ నుంచి ప్రతి 10 నిమిషాలకు ఆటోలు ఉంటాయి.



కనువిందు చేసే రేవుపోలవరం సముద్రతీరం (ఇన్‌సెట్) రేవుపోలవరంలో ఏర్పాటు చేసిన శివపార్వతుల విగ్రహాలు

- విజయ తీరాలకు చేర్చే సాధనం అదే..
- కలెక్టర్ విజయ కృష్ణన్
- డీఎస్సీ ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభం

లక్ష్యంపైనే గురి..



ఏకలవ్య కరెంటు అఫైర్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



యువ ఉత్సవ్‌లో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

తుమ్మపాల: ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా చేసుకుని కష్టపడి చదవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ గౌరీ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ శిబిరాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకుని కష్టపడి చదివితే ఫలితాలు సాధించవచ్చని, లక్ష్యం నుంచి దృష్టి మరల్చకూడదన్నారు. టెక్నాలజీని మన అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని, సోషల్ మీడియాకు బానిస కాకూడదన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలు కూడా పోటీ పడాలని, విజయం సాధించి మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం పొందాలని చెప్పారు. నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా సబ్జెక్టు పరిజ్ఞానం, వర్తమాన అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి, మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం డైరెక్టర్ కె.రాజేశ్వరి మాట్లాడుతూ టెట్‌లో మెరిట్ ప్రాతిపదికన రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేశామని, ఈ కేంద్రంలో 220 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తామన్నారు. బయోమెట్రిక్ హాజరు నమోదుతో శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో 75 శాతం హాజరు నమోదు ఉన్న అభ్యర్థులకు నెలకు రూ.1500 స్టైఫండ్, డీఎస్సీ మెటీరియల్ కోసం రూ.వెయ్యి అందజేస్తామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు మాట్లాడుతూ ఆంధ్ర ఒరిస్సా సరిహద్దులలో గల మారుమూల గిరిజన తెగకు చెందిన చినిమిగిరి అనే బాలిక చదువే ధ్యేయంగా చేసుకొని ఒడిశా రాష్ట్ర గ్రూప్ వన్ అధికారిగా ఉద్యోగం సాధించిందని, ఇతరులకు స్ఫూర్తిగా నిలిచిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.అర్జున అప్పారావు రూపొందించిన ఏకలవ్య కరెంటు అఫైర్స్ పుస్తకాన్ని కలెక్టరు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జోగారావు, శ్రీ గౌరీ లైబ్రరీ సంఘం అధ్యక్షులు కె.వి.రమణ పాల్గొన్నారు.

యువజనోత్సవాల ద్వారా ప్రతిభకు గుర్తింపు

యువజనోత్సవాల్లో పాల్గొనడం ద్వారా యువత తమ ప్రతిభను ప్రదర్శించి, గుర్తింపు పొందవచ్చునని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో స్థానిక శ్రీ గౌరీ గ్రంథాలయంలో 'యువ ఉత్సవ్-2024' వేడుకలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన, సృజనాత్మకత, సామూహిక చైతన్యం, దేశభక్తిని పెంపొందించడానికి యువజనోత్సవాలు దోహదపడతాయన్నారు. సంప్రదాయ కళలైన నృత్యం, సంగీతం, నటన వంటి అంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు.

నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి జి.మహేశ్వరావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో సైన్స్ మేళా, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, సాంస్కృతిక, సంప్రదాయక ప్రదర్శనల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ కె.తామస్ రవికుమార్, వివిధ పాఠశాలల విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

పంచాయతీ అధికారిపై అంత ప్రేమెందుకో..!

- ఆరోపణలపై విచారణ జరుగుతున్నా అందలం
- అక్రమాలు బహిర్గతమైనా ఉన్నత పదవులు
- ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో అవకతవకలపై కొనసాగుతున్న దర్యాప్తు
- విచారణ కొలిక్కి రాకుండానే యలమంచిలి నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్‌గా నియామకం
- జూనియర్లకు ఉన్నత పదవులు.. సీనియర్లు మండలాలకే పరిమితం

సాక్షి, అనకాపల్లి: పంచాయతీరాజ్ విభాగంలో ఇటీవల జరిగిన బదిలీల అవకతవకలపై విచారణ జరుగుతున్నా... ఆ పంచాయతీ అధికారికి పదవుల మీద పదవులు కల్పిస్తూ అందలం ఎక్కిస్తున్నారు. ఒకపక్క పంచాయతీరాజ్‌శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమ శాఖలో అవినీతికి, అక్రమాలకు తావు లేదని చెబుతుంటే.. అనకాపల్లి జిల్లా పంచాయతీరాజ్ విభాగంలో మాత్రం ఉన్నతాధికారి మీదే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీల్లో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ అధికారిపై జిల్లా ఉన్నత స్థాయి అధికారులు కూడా అత్యంత ప్రేమ కనబరుస్తున్నట్లు ప్రస్తుత పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని, అక్రమాలను సరిచేయమని ఈవోపీఆర్డీలే విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. మైదాన ప్రాంతాల్లో పోస్టులు ఖాళీ లేవని, అందుకే ఏజెన్సీలో పనిచేస్తున్న వారిని మైదాన ప్రాంతాలకు బదిలీ చేయలేదని అధికారులు చెబుతున్నారు. సర్వీసులో ఇంత వరకు ఏజెన్సీలో పనిచేయని ఈవోపీఆర్డీలను నిబంధనల ప్రకారం ఏజెన్సీలో నియమించాల్సి ఉంది. కానీ వారి జోలికి అధికారులు వెళ్లకపోవడం ఆరోపణలకు తావిస్తోంది. ఆ ఆరోపణలపై విచారణ ఇంకా పూర్తి కాకపోయినప్పటికీ.. ఆ అధికారిని నిబంధనలకు విరుద్ధంగా అందలమెక్కించడం విమర్శల పాలైంది. ఆరోపణలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో విచారణ జరుగుతుండగానే.. నిబంధనలకు విరుద్ధంగా ఆ పంచాయతీ అధికారికి పదోన్నతి కల్పించడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

మండల స్పెషల్ అధికారులుగా సీనియర్లు

డీఎల్‌పీవో స్థాయిలో ఉన్న జూనియర్ అధికారిని యలమంచిలి నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. డీఎల్‌డీవో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్థాయిలో ఉన్న సీనియర్లను మండల స్పెషల్ ఆఫీసర్లుగా పంపించారు. ఇప్పటికే ఎంపీడీవో స్థాయి అధికారికి జిల్లా పంచాయతీ శాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా డీఎల్‌పీవో కన్నా తక్కువ స్థాయిలో ఉన్నా ఈ అధికారిని యలమంచిలి నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. అనకాపల్లి నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్డీవో షేక్ ఆయిషా, పాయకరావుపేటకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ, చోడవరానికి డీఎఫ్‌వో జి.లక్షణ్, మాడుగులకు అగ్రికల్చర్ జేడీ మోహన్‌రావు, యలమంచిలి నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్‌గా ఇన్‌చార్జి డీపీవో శిరీషరాణి నియమితులయ్యారు. అనకాపల్లి, ఎస్.రాయవరం మండల స్పెషల్ అధికారులుగా సీనియర్లయిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుబ్బలక్ష్మి, కె.రమామణిలను నియమించడం విమర్శలపాలైంది.

తండ్రి కళ్ల ముందే మృత్యు ఒడికి..

8లో

క్లుప్తంగా

అంగన్‌వాడీల నిరసన గళం

- హామీలు అమలు చేయాలని డిమాండ్



నెహ్రూచౌక్ వద్ద అంగన్‌వాడీ కార్మికుల నిరసన

అనకాపల్లి: మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్పు చేయాలని, మెయిన్ వర్కర్స్‌తో సమానంగా మినీ అంగన్‌వాడీ వర్కర్స్‌కు జీతాలు చెల్లించి, ప్రమోషన్లు కల్పించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నెహ్రూచౌక్ వరకు ర్యాలీ నిర్వహించి, శనివారం ఒక రోజు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. గతంలో 42 రోజుల సమ్మె కాలానికి జీతాలు చెల్లించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడారు. యూనియన్ జిల్లా నాయకులు జి.రామలక్ష్మి, కె.పార్వతి, వరలక్ష్మి, తనూజ, అంజలి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు నగదు అందజేత



మరణించిన ఏఎస్‌ఐ చిన్నయ్య భార్య మచ్చమ్మకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: విశాఖ ఉమ్మడి జిల్లాలో పోలీస్ శాఖలో విధుల నిర్వహించి పదవీవిరణ పొందిన ఉద్యోగులకు కోఆపరేటివ్ సొసైటీలో దాచుకున్న సొమ్మును ఎస్పీ తుహిన్ సిన్హా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఏఆర్ హెచ్‌సీలు ఆర్.శ్రీరామ్‌మూర్తికి రూ.1,72,900, పి.శ్రీనివాసరావుకి రూ.1,44,200, ఏఎస్‌ఐ పి.చిన్నయ్య మరణానంతరం అతని భార్య మచ్చమ్మకు డెత్ రిలీఫ్ ఫండ్‌తో కలిపి రూ. 2,05,500, హెచ్‌సీ ఎం.విక్టర్‌బాబుకుఅవసరాల నిమిత్తం రూ.1,38,500 అందజేసినట్టు చెప్పారు. అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్, సీఐ బి.రామకృష్ణారావు, కోఆపరేటీవ్‌సొసైటీసభ్యులు పాల్గొన్నారు.

• ఓహో పావురమా.!



ఏయూక్యాంపస్: కడలి కెరటాలు ఒకవైపు.. కపోతాల సమూహం మరోవైపు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్.కె.బీచ్ వద్ద వందలాది పావురాలు వస్తుంటాయి. పర్యాటకులు వేసే గింజలు, ఆహార పదార్థాలను తినేసి ఎగిరిపోతుంటాయి. రివ్వున ఎగిరే పావురాల గుంపును చూసి పలువురు తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసుకుంటున్నారు. నగరవాసులు, పర్యాటకులకు ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

• కైలాసగిరిపై స్కై సైక్లింగ్



ఆరిలోవ: కైలాసగిరి శనివారం సందర్శకులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో పర్యాటకులు కైలాసగిరిని సందర్శించి, శివ పార్వతుల విగ్రహాల వద్ద ఫొటోలు దిగారు. కాగా.. కైలాసగిరిపై ఏర్పాటు చేసిన స్కై సైక్లింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం స్కై సైక్లింగ్ ట్రయల్‌రన్ కొనసాగుతుండగా.. త్వరలోనే అందుబాటులోకి రానుంది. సుమారు 200 మీటర్ల పొడవైన తీగలపై గాల్లో తేలుతూ కైలాసగిరి కొండ చుట్టూ ఉన్న అందాలను తిలకించవచ్చు. పచ్చదనం, నీలి సముద్ర తీరం, ఎత్తైన భవనాలు కనువిందు చేయనున్నాయి. ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

16 కిలోల గంజాయి పట్టివేత



నిందితులతో పోలీసులు

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం స్కూటీపై తరలిస్తున్న 16 కిలోల గంజాయిని పట్టుకుని, ఓ యువకుడిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన కాగిత జశ్వంత్ అనే యువకుడు స్కూటీపై గంజాయి తరలిస్తున్న సమయంలో అల్లూరి పార్కు వద్ద పట్టుకుని, కోర్టుకు తరలించినట్టు చెప్పారు. జశ్వంత్ నుంచి గంజాయితో పాటు స్కూటీ, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

సర్పంచ్‌లను వేధిస్తున్న డీపీవో

- వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: వైఎస్సార్ సీపీ మద్దతుదారు సర్పంచ్‌లను డీపీవో శిరీషారాణి వేధిస్తున్నారని, పంచాయతీ రికార్డులను అక్రమంగా తీసుకెళ్లి ఇబ్బందులు పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు అన్నారు.అడ్డురోడ్డు క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారులైన సర్పంచ్‌లను కూటమి ప్రభుత్వ నాయకుల ఆదేశాలతో అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక డైవర్షన్ రాజకీయాలకు కూటమి నాయకులు తెరలేపారని ఆరోపించారు. నర్సీపట్నం డివిజన్ పరిధిలో ఇప్పటికే 100కి పైగా పంచాయతీల్లో రికార్డులను డీపీవో శిరీషారాణి తీసుకువెళ్లారన్నారు. అక్రమంగా రికార్డులు తీసుకువెళ్లి సర్పంచ్‌లను ఇబ్బందులు పెట్టడం మంచి పద్ధతి కాదని విమర్శించారు. కొన్ని పంచాయతీల్లో కోర్టు స్టేలు విధించినా ఆర్డర్స్ ఇవ్వడంలేదన్నారు.ఈ సమస్యలపై ఇప్పటికే కలెక్టరుకు తెలియజేసినట్టు చెప్పారు.డీపీవో నిబంధనలు అతిక్రమిస్తున్నారని ఆరోపించారు.సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా ఉపాధి హామీ పనులు చేసేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. పంచాయతీలకు ప్రత్యేకత కల్పించి, సర్పంచ్‌లకు అన్ని హక్కులు ఉండేలా చేస్తామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీలు ఎక్కడా అమలు కాలేదన్నారు.వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేసిందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో శాంతి భద్రతు గాడి తప్పాయని, కూటమి అధికారం చేపట్టిన తరువాత ఐదు నెలల్లో రాష్ట్రంలో ఐదు నెలల్లో హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. ఇకనైనా సర్పంచ్‌లపై వేధింపులు ఆపకుంటే వైఎస్సార్‌సీపీ నేతలతో గ్రామ స్థాయిలోఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వైఎస్సార్ సీపీ పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల మండల అధ్యక్షులు చిక్కాల రామారావు, శీరం నరసింహమూర్తి,కిల్లాడ శ్రీనివాసరావు,సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు,సకినేటి వెంకటరమణ,చోడిపల్లి గోవిందు,వైఎస్సార్ సీపీ నాయకులు మధువర్మ,పొలుమూరి అప్పలరాజు పాల్గొన్నారు.

తండ్రి కళ్లముందే మృత్యు ఒడికి..



రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన బాలుడు (ఇన్‌సెట్) మృతుడు పవన్‌కుమార్ (ఫైల్)



బాలుని ఇంటి వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్న సీఐ వెంకటరావు

- తండ్రి వెంట పరుగులుతీసి బస్సు ఢీకొనడంతో దుర్మరణం
- అగనంపూడి జాతీయ రహదారిపై ఘోర సంఘటన
- శోకసంద్రంలో తల్లిదండ్రులు, బంధువులు

అగనంపూడి: ఇక్కడి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం అందరినీ కన్నీరు పెట్టించింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు కళ్లముందే ముందే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు. ఈ హృదయ విదారక ఘటనకు సంబంధించి పోలీసుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడలోని ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న దేముళ్లు, భార్య దేవి, కుమార్తె వెంకటి, కుమారుడు పవన్‌కుమార్ స్థానిక బీసీ కాలనీలో నివాసం ఉంటున్నారు. కాలనీకి సమీపంలోనే సాధన పబ్లిక్ స్కూల్‌లో పవన్, ప్రభుత్వ పాఠశాలలో కుమార్తె ఏడవ తరగతి చదువుతోంది. ఎప్పట్లాగే కుమారుడు పవన్‌ను దేముళ్లు పాఠశాల వరకు తీసుకెళ్లారు. లోపలకు వెళ్లిపొమ్మని చెప్పి అక్కడి నుంచి పరవాడ ఫార్మా కంపెనీకి వెళ్లేందుకు బస్సు కోసం ఆయన జాతీయ రహదారి దాటుతుండగా కుమారుడు వెంట పడ్డాడు. అదే సమయంలో లంకెలపాలెం నుంచి గాజువాక వైపు వస్తున్న ఫార్మా కంపెనీ బస్సు పవన్‌ను ఢీకొట్టడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అప్పటి వరకు తనతో కలిసి ఉన్న కుమారుడు కళ్లెదుటే ప్రాణాలు కోల్పోవడంతో తండ్రి దేముళ్ల తట్టుకోలేక పోయాడు. గుండెలివిసేలా రోదించాడు. కుమారుడు మరణవార్త తెలుసుకున్న తల్లి దేవి గుండెలు బాదుకుంటూ సంఘటన స్థలం వద్ద విలపించడం అక్కడున్న వారందరినీ కంట తడి పెట్టించింది. బంధువులు బోరున విలపించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దువ్వాడ సీఐ కిల్లి వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబం సొంతూరు చోడవరం మండలం లక్కవరం పంచాయతీలోని మామిడిపల్లి గ్రామమని బంధువులు తెలిపారు.

జ్వాలాతోరణం వద్ద అపశ్రుతి



ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులు

అనకాపల్లి: కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక గొల్లవీధి శివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జ్వాలా తోరణం కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామివారి పల్లకీని వీధుల్లో ఊరేగించిన అనంతరం జ్వాలాతోరణం కింద నుంచి తీసుకువెళ్తున్న సమయంలో పల్లకీని మోస్తున్న భక్తులు పడిపోయారు. దీంతో గొల్లవీధికి చెందిన ముగ్గురికి స్వల్పంగా కాలినగాయాలయ్యాయి. వారిని హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడే చికిత్స పొందుతున్నారు.

పరవాడ ఎస్సై రామారావు సస్పెన్షన్

పరవాడ: పరవాడ ఎస్సై రామారావును సస్పెండ్ చేస్తూ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రామారావు పనిచేసిన నాతవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో తాండవ జంక్షన్‌లో ఒక భూవివాదంలో చేతివాటం చూపించి సాక్ష్యాలు తారుమారు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో నర్సీపట్నం డీఎస్పీ మోహన్ విచారణ చేశారు. ఆ నివేదిక ఆధారంగా డీఐజీ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

రెండు వ్యాన్లు దగ్ధం



శివరాంపురంలో దగ్ధమవుతున్న వ్యాన్లు

బుచ్చెయ్యపేట: మండలంలోని ఆర్.శివరాంపురంలో నమ్మి తాతాజీ అనే వ్యక్తికి చెందిన రెండు వ్యాన్లు దగ్ధమయ్యాయి. గ్రామంలో రోడ్డు పక్కన ఉంచిన రెండు వ్యాన్ల నుంచి శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత రెండు గంటల ప్రాంతంలో మంటలు ఎగసిపడడాన్ని స్థానికులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టినట్లు అనుమానిస్తున్నారు. ఈ మేరకు బాధితుడు తాతాజీ బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్‌ఐ శ్రీనివాసరావు విచారణ చేస్తున్నారు.

ప్రతి వేతనదారునికి 100 రోజుల పని దినాలు

- డ్వామా పీడీ పూర్ణిమాదేవి



హైస్కూల్లో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణను పరిశీలిస్తున్న పీడీ పూర్ణిమాదేవి

కె.కోటపాడు: ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి వేతనదారుడికి 100 రోజుల పనిదినాలను కచ్చితంగా కల్పించాలని డ్వామా ప్రాజెక్ట్ అధికారి, మండల ప్రత్యేకాధికారి ఆర్.పూర్ణిమాదేవి తెలిపారు. కె.కోటపాడు ఎంపీడీవో కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో జరిగే ఉపాధి పనుల పరిశీలనను మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆమె పరిశుభ్రత పనుల్లో పాల్గొన్నారు. స్థానిక హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందించాలని పూర్ణిమాదేవి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు, ఎంఈవో సత్యనారాయణ, డీవీడీ.ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ సుమతి, ఏపీవో అప్పలరాజు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న టిప్పర్



ప్రమాదానికి గురైన టిప్పర్

బుచ్చెయ్యపేట: మండలంలోని నీలకంఠాపురం గ్రామ శివారులో టిప్పర్ ఢీ కొనడంతో ఓ విద్యుత్ స్తంభం విరిగిపోయింది. శనివారం తెల్లవారుజామున కశింకోట-బంగారుమెట్ట(కేబీ) రోడ్డులో బుచ్చెయ్యపేట నుంచి అనకాపల్లి వైపు రాయి లోడుతో వెళ్తున్న టిప్పర్ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

క్వారీలో ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



బోల్తాపడిన ట్రాక్టర్, (ఇన్‌సెట్) రాము మృతదేహం



మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

- మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్

ముదుగుల రూరల్: మండలంలో అవురువాడ పంచాయతీ శివారు సీతబందల నేషనల్ గ్రానైట్ క్వారీలో ట్రాక్టర్ బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రావికమతం మండలం బుడ్డిబంద గ్రామానికి చెందిన కిముడు రాము(35) క్వారీలో డ్రిల్ మిషన్‌తో పనిచేస్తున్నాడు. రాము పనిచేస్తున్న సమయంలో పక్క నుంచి వెళ్తున్న ట్రాక్టర్ అతనిపై బోల్తాపడింది. దీంతో రాము అక్కడికక్కడే మృతి చెందాడు మృతుడికి భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జి.నారాయణరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.

మృతుడు కుటుంబానికి రూ.50 లక్షలు ఇవ్వాలని మృతుడి బంధువులు, సీపీఎం నాయకుడు నర్సింహమూర్తి తదితరులు డిమాండ్ చేస్తూ సంఘటనా స్థలం వద్ద ఆందోళన చేశారు. రూ.50 లక్షలు చెల్లించకుంటే మృతదేహాన్ని క్వారీనుంచి తరలించనివ్వమని భీష్మించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి మహిళ మృతి



నూతిలో లక్ష్మి మృతదేహం

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం శివారు చిటిమిరెడ్డిపాలెంకు చెందిన చిటిమిరెడ్డి లక్ష్మి(57) బావిలో పడి మృతిచెందిన ఘటన శనివారం వెలుగు చూసింది. కాశీపురం సచివాలయానికి సమీపంలో తారురోడ్డుకు ఆనుకొని ఉన్న బావిలో చిటిమిరెడ్డి లక్ష్మి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సచివాలయ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. మృతురాలు లక్ష్మి భర్త సత్తిబాబు మూడేళ్ల క్రితం మరణించాడు. లక్ష్మికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరు తమ కుటుంబాలతో విశాఖపట్నంలో ఉంటున్నారు. చిటిమిరెడ్డిపాలెంలో ఒంటరిగా ఉంటున్న లక్ష్మి ఈ నెల 14వ తేదీ సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించడానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. ఈ క్రమంలోనే ప్రమాదవశాత్తు నూతిలో పడి మృతిచెంది ఉంటుందని హెడ్‌కానిస్టేబుల్ పైడిరాజు విలేకరులకు తెలిపారు. మృతదేహం నుంచి దుర్వాసన రావడంతో రెండు రోజుల క్రితమే బావిలో పడి మృతి చెంది ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి, శవ పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టానికి ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు నానిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్‌కానిస్టేబుల్ పైడిరాజు తెలిపారు.

వ్యర్థాల రీసైక్లింగ్‌తో పర్యావరణ అనుకూల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

పాయకరావుపేట: వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే ప్రక్రియను అభివృద్ధి చేస్తేనే పర్యావరణ అనుకూల అభివృద్ధి సాధ్యమవుతుందని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ తెలిపారు. పర్యావరణ సమస్యలు – సుస్థిర అభివృద్ధి అనే అంశం పై స్పేసెస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఆర్థిక, సామాజిక, మానవ అభివృద్ధితో పాటు పర్యావరణ వృద్ధి కూడా జరిగితేనే సమగ్ర అభివృద్ధిగా భావించాలని, దీని కోసం వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే ప్రక్రియ అభివృద్ధి చేయాలన్నారు. కాలుష్యాన్ని తగ్గించాలంటే శిలాజ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక ఇంధనమైన సౌరశక్తి, పవనశక్తి, హైడ్రోజన్ ఇంధన శక్తిని ఉపయోగించాలని తెలిపారు. వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి యువత ముందుకు రావాలని చెప్పారు. ప్లాస్టిక్ వ్యర్థాలను నిరోధించవలసిన బాధ్యతను కూడా యువత తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, శాస్త్రవేత్త ఎల్.నగేష్, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్ ప్రకాష్, ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిండు కుండలా ఏలేరు కాలువ



శంకరం వద్ద నిండుగా ప్రవహిస్తున్న ఏలేరు నీరు

తుమ్మపాల: ఇటీవల కురిసిన వర్షాలతో జలపాతాలు నిండుకుండల్లా తయారయ్యాయి. దీంతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు విస్తరించి ఉన్న ఏలేరు కాలువ గుండా నీరు నిండుగా ప్రవహిస్తోంది. బొజ్జన్న కొండకు అతి సమీపంలో రోడ్డుకు ఆనుకుని నాలుగు కిలోమీటర్ల పొడవున ఏలేరు ఉంది. ఏలేరు గట్టును ఇటీవల జేసీబీలతో ఇరువైపులా శుభ్రం చేయడం, చుట్టు పచ్చని పంట పొలాల మధ్య నుంచి ఏలేరు పారడంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో అనేక మంది అక్కడికి చేరుకుని సేద తీరుతున్నారు.

కూటమి పాలనలో పెరిగిన నిరుద్యోగ సమస్య

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జిల్లాలో నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని, పరిశ్రమలు తీసుకురావడంలో అధికారులు, టీడీపీ నేతలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అన్నారు. మండలంలో తుమ్మపాల గ్రామం, పట్టణంలో పెరుగుబజార్ జంక్షన్ రహదారిలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి నిరుద్యోగ సమస్య అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, లేని పక్షంలో తక్షణమే టీడీపీ సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఆయన కోరారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సభలు

రోలుగుంట: రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ సభలు శనివారంతో ముగిశాయి. చివరి రోజు రోలుగుంటలో నిర్వహించిన సభలో పలు భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను తహసీల్దార్ ఎస్.నాగమ్మ రైతుల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ 16 రెవెన్యూ గ్రామ సభల్లో సుమారు 230 వినతులు స్వీకరించామని, వాటన్నిటినీ త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు, ఆర్ఐ రామ్మూర్తి, మండల సర్వేయర్ తవుటు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 2,671 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,610	4,480
మొదటి రకం	3,660	4,300
రెండో రకం	3,400	3,820
మూడోరకం	3,220	3,370

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మట్కా	: షిర్డిసాయి
గ్లాడియేటర్	: వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీ భాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్ 4 యూనిట్లు, బి పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 398 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 354 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

పేరు గొప్ప.. ఊరు దిబ్బ

- పేరుకే రైతు సేవా కేంద్రాలు
- ఏ కోశానా కానరాని సేవాభావం
- ఆర్‌బీకే కేంద్రాల పేరు మార్చేసిన కూటమి ప్రభుత్వం
- నిరుపయోగంగా కియోస్క్ మిషన్లు



బట్టపూడి ఆర్‌బీకే కేంద్రంలో కియోస్క్‌ను ప్రారంభిస్తున్న నాటి మంత్రి అమర్‌నాథ్ (ఫైల్)

అనకాపల్లి: దేశానికి అన్నం పెట్టే రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైనట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో రైతులకు ఎంతో మేలు జరిగింది. రైతు బాగుంటే దేశం బాగుంటుందన్న మాట వైఎస్సార్‌సీపీ పాలనలోనే వినిపించిందని చెప్పుకుంటున్నారు. రైతులు నివసిస్తున్న గ్రామాల్లోనే ఆర్‌బీకే సేవలు తీసుకువచ్చి వారికో వరంలా మార్చింది. టీడీపీ పాలనలో రైతన్నలు ఎరువులు, విత్తనాలు ఇతర సామగ్రి కోసం కష్టాలు పడకూడదని వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాల్లో ఆర్‌బీకే కేంద్రాలు ఏర్పాటు చేసి సకాలంలో రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించారు. ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించారు. కానీ నేటి టీడీపీ పాలనలో విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రైతు భరోసా కేంద్రాల్లోని కియోస్క్‌ల సాయంతో సాంకేతికంగా రైతులను ముందుకు తీసుకెళ్లేలా చొరవ చూపిండడంతో వారు ఎంతో ఆనందం చెందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చినప్పటికీ సేవల కొనసాగింపులో వివక్ష జరుగుతోంది. వైఎస్సార్‌సీపీ ముద్ర లేకుండా చేయడానికి ఆ సేవలకు స్వస్తి పలికింది. ఆర్‌బీకే లక్ష్యాన్ని నీరు గారుస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లోని కియోస్క్ సేవలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం మండలంలో కియోస్క్ కేంద్రాలు ఎక్కడా పని చేయడం లేదు.

ఆర్‌బీకేలపై నిర్లక్ష్యం..

కూటమి ప్రభుత్వం రాకతో ఆర్‌బీకేలపై నిర్లక్ష్యం పెరిగింది. ఇందులోని సేవలన్నీ మాయవయ్యాయి. సాంకేతిక కారణాలతో ఆయా కేంద్రాల్లోని కియోస్క్ యంత్రాలు ఇప్పుడు దిష్టిబొమ్మలుగా మారాయి. కొన్ని చోట్ల ఇవి బాగున్నా ఇంటర్‌నెట్ లేదంటూ ఆపేశారు. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం నిరుపయోగమైంది. కియోస్క్‌లున్నా రైతులకు మేలు చేయని పరిస్థితి కల్పించినట్లు అయింది. స్థానిక వ్యవసాయశాఖ అధికారులు సైతం దృష్టి పెట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కియోస్క్ మిషన్ వివరాలు..

రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు, వారు నమోదు చేసుకునే పంట వివరాలు పూర్తి సమాచారం ఈ యంత్రం ద్వారా తెలుసుకోవచ్చు. మండల పరిధిలో రైతులు ఏఏ ప్రాంతాల్లో ఏ సమయంలో పంటలు వేస్తారో సులువుగా అర్థం అవుతుంది. ప్రభుత్వం రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందజేసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది.



కోడూరులో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ డిజిటల్ మిషన్

కియోస్క్ మిషన్లు ఉపయుక్తం



గత పాలనలో రైతులకు కియోస్క్ మిషన్లు ఎంతగానో ఉపయోగపడ్డాయి. వారికి కావలసిన ఎరువులు, విత్తనాలు సకాలంలో కియోస్క్ మిషన్ల ద్వారా ఆన్‌లైన్ చేసుకునేందుకు వీలయ్యేది. ప్రస్తుతం ఈ మిషన్ పని చేయడం లేదు.

– అప్పారావు, అక్కిరెడ్డిపాలెం, అనకాపల్లి మండలం

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి



ఆర్డీవో షేక్ అయేషాకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

అనకాపల్లి: అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోయిన బాధితుల సమస్యలు పరిష్కరించాలని, మునగపాక నుంచి అనకాపల్లి బైపాస్ వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణలో నష్టపోయిన బాధితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. రామ సదాశివరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో షేక్ అయేషాకు వినతిపత్రం అందజేశారు. రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న వారి పేర్లు లిస్టులో తప్పుగా ఉన్నాయని వాటిని సరిచేసి ఫైనల్ లిస్ట్ ప్రకటించాలని కోరారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం ప్యాకేజీ ఇవ్వాలని, రోడ్డుకు ఇరువైపుల ఏళ్ల తరబడి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న వారికి నష్టపరిహారం అందజేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కర్రి అప్పారావు, సీఐటీయూ మునగపాక కార్యదర్శి కె.బ్రహ్మాజీ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అనకాపల్లి: ఆటో మోటార్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటోమోటర్ యూనియన్ (ఏఐటీయూసీ) పట్టణ గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల బతుకులు దినదిన గండంలా మారిపోయాయని, పెరిగిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమైనట్లు ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో వాహన మిత్ర పథకం కింద పది వేలు అందజేశారని, చంద్రబాబు ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే ఆటో కార్మికుల సంక్షేమ కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చి నేడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఆటో డ్రైవర్లకు హాని చేసే జీవోలు, పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలు రద్దు చేసి కేసులు ఎత్తివేయాలని, భారీగా పెంచిన రోడ్డు ట్యాక్స్ తగ్గించాలనే డిమాండ్లతో ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.త్రినాథ్, కోరుబిల్లి శంకరరావు, కొలుసు రాంబాబు, ఎం. దేవుళ్లు, ఎస్. రమణ, కె.రాజు, పి.అప్పలనాయుడు, పెదిరెడ్ల నాగేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ స్వామినాయుడు

తుమ్మపాల: సైబర్ మోసాలు, గంజాయి స్మగ్లింగ్, వినియోగం పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సీఐ స్వామినాయుడు అన్నారు. కశింకోట విశ్వభారతి జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన సంకల్పం గంజాయి అవగాహన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి వినియోగం వల్ల కలిగే నష్టాలు, గంజాయి సంబంధిత కార్యకలాపాల్లో పాల్గొనడం వల్ల కలిగే చట్టపరమైన చిక్కులను వివరించారు. సైబర్ మోసాలు, ఆన్‌లైన్ మోసాలు జరగకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎవరైనా పోలీసులమంటూ, పార్శిల్ పంపించారని, అందులో డ్రగ్స్, ఆయుధాలు ఉన్నాయని మీపై కేసు నమోదు చేశామని కాల్ చేస్తే స్పందించవద్దన్నారు. తక్కువ వడ్డీకి ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండా అప్పులు ఇస్తామనే లోన్‌యాప్‌లను నమ్మవద్దన్నారు. పార్ట్ టైమ్, వర్క్ ఫ్రమ్ హోమ్ అంటూ, ప్రొడక్టులకు రేటింగ్ ఇవ్వడం ద్వారా డబ్బులు వస్తాయని చెప్పే యాప్‌లను, వెబ్‌సైట్‌లను నమ్మవద్దన్నారు. ఆన్‌లైన్ వివరాల్లో పాస్‌వర్డ్‌లో అక్షరాలు, సంఖ్యలు, ప్రత్యేక చిహ్నాలు కలిపి ఉండేలా బలమైన విధంగా పెట్టుకోవాలని, తరచుగా పాస్‌వర్డ్ మారుస్తూ ఉండాలన్నారు. మీ కంప్యూటర్, మొబైల్ ఫోన్, ఇతర పరికరాలను, సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు యాంటీ వైరస్ ఉపయోగించి అప్‌డేట్ చేసుకోవాలన్నారు. రైల్వే స్టేషన్, బస్టాండ్లు ఇతర పబ్లిక్ స్థలాల్లో వైఫై వాడేటప్పుడు జాగ్రత్తలు వహించాలని, మీ సొంత చార్జర్లను మాత్రమే వాడాలన్నారు. సురక్షితమైన సైట్లను మాత్రమే ఉపయోగించాలని, గుర్తింపు లేని సైట్లను వాడకూడదన్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే స్కానర్ ద్వారా పేమెంట్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని, మీ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచిత వ్యక్తులకు తెలపకూడదన్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో 1930కి, http:// cybercrime. gov. inకి రిపోర్ట్ చేయాలన్నారు. మీ ఫోన్ పోతే వెంటనే మీ ఫోన్‌లో ఉన్న నంబర్‌తో అనుసంధానం అయిన అకౌంట్లను బ్లాక్ చేసి మీ ఫోన్ గురించి ఇఉఐఖపోర్టల్ నందు ఫిర్యాదు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ



గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న మళ్ల భాస్కరరావు తదితరులు

అనకాపల్లి: పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీడబ్ల్యుజే యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలు, రోగులకు శనివారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ అధ్యక్షుడు మళ్ల భాస్కరరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

మాడుగుల రూరల్: ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించేందుకు కేంద్ర బృందం మండలంలో మూడు గ్రామాల్లో ఆదివారం పర్యటించనున్నట్టు మండల ఉద్యానవనశాఖాధికారి వి.భాను పుష్ప లీలావతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయి ల్ సీడ్స్ జాయింట్ కార్యదర్శి (న్యూఢిల్లీ) అజిత్ కుమార్ సాహూ, ఇతర సభ్యులు రఘునందన్‌రావు, కె.పోన్నుస్వామితో పాటు రాష్ట్ర ఉద్యానవనశాఖ అదనపు డైరెక్టర్ కె.బాలాజీ నాయక్, జిల్లా ఉద్యానవనశాఖాధికారి జి. ప్రభాకరరావు పర్యటించనున్నట్టు తెలిపారు. చింతలూరు, తాటిపర్తి, శంకరం గ్రామాల్లో వీరు పర్యటించి న అనంతరం బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్టలో శాంతి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సందర్శిస్తారని ఆమె పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్

నర్సీపట్నం: వచ్చేనెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్ తెలిపారు. కోర్టు సముదాయంలో పోలీసు ఉన్నతాధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసుల్లో కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు వృథా కాదన్న విషయాన్ని కక్షిదారులు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ మోహన్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.ప్రభాకర్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన వీచికలు



బహుమతులు పొందిన విద్యార్థులతో అతిథులు



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గాంధీనగరం సాయిశక్తి స్కూల్లో విద్యార్థులకు శనివారం 'గ్రంథాలయాలు.. విద్యార్థుల విజ్ఞాన వీచికలు' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ వేడుకల కన్వీనర్ బల్లా నాగభూషణం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఖాళీ సమమయంలో గ్రంథాలయాలకు విచ్చేసి మహనీయుల చరిత్ర, విజ్ఞానదాయక పుస్తకాలు చదివి సమాజ హితానికి దోహదపడాలని పేర్కొన్నారు. విద్యార్థులు భావి భారత పౌరులని, గ్రంథాలయాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని అన్నారు. పోటీల్లో గెలిపొందిన వారికి ఈనెల 20వ తేదీన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా అరసం పూర్వ అధ్యక్షుడు జీఎల్ఎన్ శాస్త్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో..

స్థానిక భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గ్రంథాలయాల వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవిద్యాధరి పాఠశాలలో శనివారం గ్రంథాలయాల ఆవశ్యగతపై డిబేట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిషత్ (సప్తాహ) చైర్మన్ ఆళ్ల ఓంరామ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి గ్రంథాలయాలపై అవగాహన కలిగి ఉండాలని, మారుతున్న కాలంలో డిజిటల్‌పై ఆసక్తి చూపడం కంటే గ్రంథాలయాల్లో దేశ నేతలు, వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు చదువుకుంటే ఎంతగానో ఉపయోగం అన్నారు. ఈ పోటీల్లో 32 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఎం. అమృత, కె.మేఘన, బి.దీప్తిసౌమ్య నిలిచారు. వారికి బహుమతులు అందజేశారు. బి.నాగరిత్య, జె.తార, ఎ.తేజస్వినిలకు కన్సొలేషన్ బహుమతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో సప్తాహ పట్టణశాఖ కార్యదర్శి డి.శివరాము, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలి

డీఎల్‌డీవో మంజులవాణి



బేతపూడి కేజీబీవీలో వంటకాను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి మంజులవాణి



దేవరాపల్లిలో చెత్తా చెదారాలు తొలగిస్తున్న మండల ప్రత్యేక అధికారి మంజులవాణి తదితరులు

దేవరాపల్లి: విద్యార్థులకు మెనూ ప్రకాకారం రుచికరమైన భోజనం పెట్టాలని డీఎల్‌డీవో, మండల ప్రత్యేక అధికారి ఎస్.మంజులవాణి సూచించారు. రైవాడ పంచాయతీ శివారుబేతపూడి కేజీబీవీని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వంటశాలలను పరిశీలించి, విద్యార్థినుల కోసం తయారు చేసిన ఆహారపదార్థాలను రుచి చూశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులకు పెట్టే ఆహారంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని సిబ్బందికి హెచ్చరించారు. అనంతరం తరగతి గదులను పర్యవేక్షించారు. అంతకు ముందు దేవరాపల్లి అంబేడ్కర్ కాలనీలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ తదితరులతో కలిసి చీపురు పట్టి చెత్తా చెదారాలను తొలగించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, నిర్వహణపై పంచాయతీ, పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



చెత్త తొలగిస్తున్న ఎంఈవో వరహాలబాబు



చుక్కపల్లిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో హేమసుందరరావు

నాతవరం: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరని ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంఈవో, ఎంపీడీవో, తహసీల్దార్, విద్యుత్, వెలుగు కార్యాలయాలు, పీహెచ్‌సీ వద్ద శనివారం ఆయా కార్యాలయాల సిబ్బంది పరిసరాలను శుభ్రపరిచారు.ఈ సందర్భంగా ఎంఈవో కార్యాలయం వద్ద వరహాలబాబు మాట్లాడారు. ఇంటింటికీ అందించిన డస్ట్‌బిన్లలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి ఎస్.వి. మూర్తి, పంచాయతీ కార్యదర్శి లాలం శేషుకుమార్, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, ఎంఆర్‌సీ మండల కోఆర్డినేటరు అంకంరెడ్డి శ్రీనివాస్‌నాయుడు, దంగేటి సాంబ, సీఆర్పీలు వెంకటలక్ష్మి, గోవిందు, పోలుపర్తి నాగేశ్వరరావు, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని స్థానిక ఎంపీడీవో వి.హేమసుందరరావు అన్నారు. మండలంలోని చుక్కపల్లిలో శనివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మజ్జి లక్ష్మణమ్మ,ఎంపీటీసీ సుంకర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం భయం భయం

- రైవాడ కెనాల్ కల్వర్టులపై ఛిద్రమైన రక్షణ గోడలు
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు
- ఇబ్బందులు పడుతున్న 20 గ్రామాల ప్రజలు



గవరపాలెం వద్ద కల్వర్టుపై రెండు వైపులా కనిపించని రక్షణ గోడలు



కల్వర్టు రక్షణ గోడలు

కె.కోటపాడు : మండలంలోని పలు రహదారుల్లో గల కల్వర్టులపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రైవాడ కెనాల్‌పై ఎనిమిది గ్రామాల సమీపంలో నిర్మించిన కల్వర్టుల రక్షణ గోడలు ఛిద్రమవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం మరీ ప్రమాదకరంగా మారింది. గోడలు లేకపోవడంతో వాహనదారులు కల్వర్టుల పై నుంచి కెనాల్ నీటి ప్రవాహంలో పడి గాయాలపాలవుతున్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో ప్రమాదం జరిగితే ప్రాణాల మీద ఆశ వదులుకోవలసిన పరిస్థితి. కల్వర్టు మీద ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో తప్పించుకునే సమయంలో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని పలు గ్రామాల ప్రజలు తెలిపారు.

20 గ్రామాల ప్రజలకు ఇక్కట్లు

మండలంలో పోతనవలస, ఉగ్గినవలస, గవరపాలెం, డి.అగ్రహారం, దాలివలస, కె.కె.అగ్రహారం, సూదివలస, కొరువాడ ప్రాంతాల వద్ద కెనాల్‌పై తొమ్మిది చోట్ల కల్వర్టులున్నాయి. వీటిలో ఒక కల్వర్టు మినహా మిగతా కల్వర్టుల రక్షణ గోడలు పూర్తిగా ఛిద్రమయ్యాయి. వీటిపై నుంచి సుమారు 20 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అధిక సంఖ్యలో ద్విచక్రవాహనాలతోపాటు ఇతర వాహనాలు కల్వర్టులపై ప్రయాణిస్తుంటాయి. ఈ కల్వర్టులను 20 ఏళ్ల కిందట జీవీఎంసీ అధికారులు నిర్మించారు. ఆ తరువాత నుంచి వీటిని పట్టించుకోవడం మానేశారు. రక్షణగోడలు శిథిలమవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలు గ్రామాల ప్రజలు తెలిపారు.

తూటిపాలలో నో బ్యాగ్ డే



కాగితాలతో తయారు చేసిన బొమ్మలతో విద్యార్థులు

మాకవరపాలెం: మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. 1,2 తరగతుల విద్యార్థులు బ్యాగు లు లేకుండా పాఠశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వివిధ రకాల కాగితం బొమ్మలు తయారు చేయించి, ఆటలు ఆడించారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యంగా నో బ్యాగ్ డేను నిర్వహిస్తున్నట్టు పాఠశాల హెచ్‌ఎం రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోషి, లోవరాజు, నారాయణరావు పాల్గొన్నారు.